# మంచి

ఆఫీసరు గదికి వెళ్ళాలి. మెట్లెక్కుతున్నాను.

రెండు మెట్లెక్కేసరికి కాలు జారింది. వెల్లకిలా పడ్డాను. అంతా నవ్వుతున్నారన్న భ్రాంతి. లేచి బట్టలు దులుపుకొనిమళ్ళీ మెట్లెక్కే ప్రయత్నం.

అసలు మెట్టు ఏదీ? తను రోజూ ఎక్కే మెట్లేనే, ఎందుకంత తొట్రుపాటు పడుతున్నట్టు.

మళ్ళీ కాలు జారింది. అసలు మెట్లు లేనే లేవు.

మెట్లు లేకుండా మీదకు పోవడం ఎలా?

కంగారు పుట్టింది. భయంవేసింది. ఒళ్ళంతా వేడెక్కిపోయింది. మతిపోతోంది. అసలు తాను ఎవరు?

అద్దంలో ముఖం చూసుకోవాలనిపించింది.

అద్దంలో ముఖం తనదికాదు. గుట్టమీద దుబ్బుల్లా దట్టమైన కనుబొమలు. వంకర దేలిన ముక్కు. ఖణఖణ మండుతున్న చింతనిప్పుల్లాంటి కళ్ళు? పీక్కుని పోయి ఉన్న బుగ్గలు. వికృతంగా గడ్డం.

అది మనిషి ముఖం కాదు. రాబందు ముఖం.

ఊరు చివర కంపు కొడుతున్న ఆవు కళేబరం. ఎనిమిది రాబందులు పీక్కుని తింటున్నాయి. నాలుగు రోజుల నుంచీ అదేపనిగా తింటున్నయ్యేమో, మాంసం పూర్తిగా అయిపోయింది. ఇక మిగిలినది ఎముకలే. అయినా రాబందులు ఆ ఎముకల్ని కూడా ప్రశాంతంగా ఉండనివ్వకుండా గుంపులవద్దముక్కులతో పొడుస్తున్నాయి.

ముసలి రాబందు పోట్లాడి పోట్లాడి, తిని తిని అలిసిపోయి ముసలి కళ్ళు మూసుకుపోతుండగా బరువుగా, అసహ్యంగా, వూబతేరిపోయిన కోటీశ్వరుడిలా మెల్లగా లేచి వింతగా రెక్కలు వూపుకుంటూ దూరాన ఉన్న వేప చెట్టు మీద సింహాసనం వేసింది. మగతగా ఆవు పుర్రెవైపు చూస్తోంది.

కళ్ళు నులుపుకుని మళ్ళీ అద్దంలోకి చూశాడు అవధాని.

తనకు మతి స్థిమితం తప్పుతోందా?

అలా కాకూడదు. అలా ఎన్నటికి కాకూడదు.

కళ్ళు మూసుకుని గట్టిగా కేకపెట్టాడు.

"ఏవండీ! అంత కేకపెట్టారు?" కంగారుగా గదిలోకి వచ్చి అద్దం ఎదురుగా నుంచున్న భర్తను చూసి అడిగింది శాంతమ్మ.

"శాంతం, శాంతం! నా కళ్ళు చూడు."

"ఏమయిందండీ, కంట్లో ఏమైనా పడిందా?"

"చూడు చూడు. ఎంత ఎర్రగా ఉన్నయ్యో!"

"లేదండీ, నాకేం ఎరుపు కనపడడం లేదు. ఉండండి దీపం వేస్తాను." గోడమీద స్విచ్చి వేసేసరికి చిటుక్ చిటుక్‌మని శబ్దం చేసి జిగ్గున వెలిగింది ట్యూబ్‌లైట్.

మీరు అసలు లేచి ఎంత సేపయిందండీ?

జవాబు చెప్పకుండా తువ్వాలు భుజాన వేసుకుంటున్న భర్త ముఖం చూసి తత్తరపాటు చెందింది శాంతమ్మ.

ఒక క్షణం అద్దం వంక చూసి లోపలకు వెళ్ళిపోయింది.

శర్మ అంటే అవధానికి అమితమైన గౌరవం. ఒకరకమైన భక్తి. కేవలం ఆఫీసులో తనమీద వాడనేకాదు, శర్మ సౌశీల్యం అల్లాంటిది. రోడ్డు మీద ఒక్కరూ ఎవరికీ కనపడేవాళ్ళు కాదు. ఎప్పుడైనా శర్మ ఒక్కడూ వెడుతుంటే, అవధాని గారికి ఒంట్లో బాగా లేదా అని అడిగేవారు తారసపడిన పరిచయస్తులు

బొగ్గు, బస్తా మొదలు భార్య చీరవరకూ, శర్మ సలహా లేనిదే అవధాని ఏం కొనేవాడుకాదు. అన్నిటికీ అతన్ని సంప్రదించేవాడు.

అన్నగారు అన్నగారని శకుంతలమ్మా అవధానిని ఎంతో ఆదరించేది. శాంతమ్మకీ, శకుంతలమ్మకీ వయసులో తేడా ఉన్నా వదిన వరస పెట్టుకుని ఎంతో స్నేహంగా ఉండేవారు. శాంతమ్మకి పిల్లలులేరన్న చింతలేకుండా శర్మ పిల్లలు అవధాని ఇంట్లో వాళ్ళ మేనత్తలూ, పిన్నులూ ఇళ్ళలో తిరుగుతున్నట్టు చనువుగా తిరుగుతూ ఉండేవాళ్ళు.

శకుంతలమ్మ కన్న కడుపే అయినా శాంతమ్మది పెంచిన ప్రేమ. బాబీ, కోమల, సరోజ, విఠల్ నలుగురు పిల్లలకీ శాంతమ్మత్తంటే ప్రాణం. పండుగలకు పిల్లలందరికీ తన చేత్తో ఇంత చేసి పెడితేకాని శాంతమ్మకీ తృప్తి ఉండేదికాదు. పిల్లలకీ అవిడని కనీసం రోజుకోసారైనా చూడకపోతే ఎలాగో ఉండేది.

అవధాని అంటే శర్మకి ప్రత్యేకమైన అభిమానమనీ వోటీలూ, కమాన్లూ అతనికే గిట్టు బాటయ్యేటట్టు చూస్తాడనీ లోలోపల గునిసినా బయటకు కిమ్ అనకుండా ఉండేవారు, ఆఫీసులోని గుమాస్తాలు. అందరినీ అన్నదమ్ముల్లా చూసుకోవడం శర్మలోని ఘనత.

ఆఫీసుకు ఒక అరగంట అటూ ఇటూ అయినా ఎవరిని నొప్పించకుండా, నయాన్నే చెప్పి పనులు చేయించడం, అధికారికి ఏవిధమైన తల నొప్పి లేకుండా అన్నీ తను చూసుకోవడంవల్ల శర్మంటే అందరికీ ఒకవిధమైన గౌరవం. బంధుసరళి ఎక్కువ అవడం ములాన్న, వచ్చేపోయేవాళ్ళ రద్దీవల్లా, శర్మ డబ్బు వ్యవహారం ఎప్పుడూ మైనెస్‌లోనే ఉండేది.

కొంతమంది మనుషుల సంగతే అంత! రేపటి విషయం ఆలోచించకుండా ఎప్పుడూ ఉల్లాసంగా నవ్వుతూ కబుర్లు చెప్పగలగడం కొందరి ప్రత్యేకత.

శాంతమ్మ అంటుండేది: "రోజులు చూస్తే మండి పోతున్నాయి. ఎలా చేస్తామో వదినా పెళ్ళిళ్ళు. మనకు కలిగిందివెనకేసుకోవాలి."

"చూడొదినా! వెనకేసుకోవాలనే నాకూ ఉంది. కాని మీ అన్నగారు నా మాట పడనిస్తారా? మొన్న పెద్ద ఆడబడుచూ, పిల్లలూ వచ్చారు. పట్టు చీర కొనకపోతే ఏంపోయే చెప్పు? అవిడకీ, పిల్లలకీ బట్టలకీ ఆరువందల రూపాయలు అయ్యాయి. చిన్న ఆడబడుచు కొడుకు ఇంజనీరింగులో చేరతాడని

వ్రాసింది. మూడొందలైనా పంపాలంటున్నారు."

"పోన్లే వదినా! ఎలా జరిగే వాళ్ళకి అలానే జరుగుతుంది. నే దాచుకున్న ఎనిమిది వందలూ వాడుకో. తరువాత చూచుకుంటాం."

ఇదీ వాళ్ళ సంభాషణ నడిచేతీరు.

ఇక ఆఫీసులో శర్మ సంగతి-

"ఏంవోయ్! అలా ఉన్నావ్? ఇంట్లో అంతా కులసాయేనా?" కుర్చీలో మాన్పడి కూర్చున్న సుబ్బారావు లేచి శర్మ వెంట పడతాడు.

"గురూగారూ! అడిగేననుకోకండి. ఐదు నిమిషాల కిందట కాఫీ తీసుకు రావడానికి వెళ్ళిన మన అప్పారావు చెప్పాడు..... మా అమ్మాయి పెద్దమనిషయిందట.... నెలాఖరు రోజులు. ఒక యాభై......"

"అదేవిటోయ్! దీంట్లో ఇంత కంగారుకేముంది?రా ఇస్తాను. ఇంట్లో పనులుంటాయ్. మధ్యాహ్నానికి పెర్మిషన్ పెట్టి వెళ్ళు."

ఇలాంటివి అందరి కంట పడకపోయినా గంటో అరగంటో తిరిగేసరికి అందరి చెవినా పడతాయి.

"ఏ మాట కా మాట అనుకోవాలి. గురుడు మహాసౌమ్యుడు సుమా. అయితే ఆ అవధాని అంటే మాత్రం ఎందుకో అంత అభిమానం? కొంప తీసి అవధాని భార్యకూ....

"ఛీ, అప్రాచ్యుడా! నీ బుర్ర అంతకంటే పని చెయ్యదు. ఇల్లాంటి ఆలోచన వచ్చినందుకు ఏనాడో అనుభవిస్తావు."

ఘాటుగా ఇచ్చేశాడు ముసలి గుమాస్తా కుర్ర గుమాస్తాకి.

ఇక ఆఫీసరు దృష్టిలో శర్మ ఒక రోజు బేధితో బాధ పడుతూ శలవు పెడితే ఆఫీసరు గిజగిజ లాడిపోవలిసిందే. అవధాని ముక్కుకు సూటిగా పోయినా, గుండె సరైన చోటున ఉన్నది శర్మకే నంటాడు ఆఫీసర్.

విశాఖపట్నం శర్మకు పుస్తె కట్టేసినట్టే. పాతికేళ్ళ సర్వీసులో ఎందరో ఆఫీసర్లూ, డైరెక్టర్లూ, మేనేజింగ్ డైరెక్టర్లు మారారు. కాని శర్మకు మాత్రం మార్పు లేదు. జీతం తప్ప.

మార్చి ఇరవై ఎనిమిది. భువనేశ్వర్ వెళ్ళి సేల్స్ పర్టికులర్స్ తేవాల్సి వచ్చింది. ఫీల్డ్ మేనేజరుతో మాటాడాల్సిన విషయమూ ఉంది. ఆఫీసర్ శర్మను పిలిచి చెప్పాడు. శర్మ అవధానికి కబురు పంపించాడు. అరగంట నోటీసుతో అవధాని ఆదరా బాదరా ఆఫీసు కారులో ఇంటికి పరిగెత్తి సూటుకేసు సర్దుకుని మెయిలుకు బయలుదేరాడు.

అదే సాయంకాలం తీరికగా కూర్చుని జ్ఞానవాశిష్ఠం చదువుకుంటున్న శాంతమ్మ దగ్గర కొచ్చాడు శర్మగారి రెండోకొడుకు.

శర్మగారికి ఆఫీసునుంచి ఇంటికి రాగానే వాంతి అయినట్టూ, కళ్ళు చీకట్లు కమ్మి, ఒళ్ళంతా చెమట పట్టినట్టూ,వీధి చివరన డాక్టరు తన కారులోనే పెద్దాసుపత్రికి చేర్చినట్టూ వార్త.

కంగారుగా తాళాలు వేసి పక్కింటి వాళ్ళకి చెప్పి రిక్షా ఎక్కింది శాంతమ్మ.

మరో గంటకి పెద్దబ్బాయి ఆస్పత్రి నుంచి తెచ్చాడు కబురు. "నాన్న గారికి ఏం ఫరవాలేదు

రెండు రోజులు ఆస్పత్రిలో ఉంచి పంపేస్తారట."

మూడో రోజు మరో వారం ఆస్పత్రిలో విశ్రాంతి తీసుకోవాలన్నారని డాక్టర్లు. అవధాని మెయిలు దిగి సూటుకేసు పట్టుకుని ఇంటికి వెళ్ళిన వాడు తాళం కప్ప చూసి పక్క వాళ్ళ ద్వారా జరిగినది తెలుసుకుని నేరుగా ఆస్పత్రికి వెళ్ళాడు. అవధానిని చూసి శర్మ నవ్వి వెళ్ళిన పని గురించి అడిగి, శాంతమ్మ తమ కుటుంబంపట్ల చూపిస్తున్న అభిమానాన్ని కొనియాడాడు.

ఆఫీసుకు వచ్చాక శర్మ సీట్లో అవధానిని పని చూడమన్నాడు ఆఫీసర్.

అవధానికి మేనేజర్ గిరీ కొత్తనిపించింది. పగలంతా ఆఫీసు పనీ, సాయంకాలం శర్మ ఇంటి దగ్గర ఓ గంట క్షేమసమాచారాలు చూడడం, అందులో వీలు చూసుకుని ఆస్పత్రి. మేనేజరుగిరీ వచ్చిన దగ్గర నుంచీ ఉదయం ఏడింటికే ఎవరో రావడం, పదింటి వరకూ స్నానానికి వీలవకపోవడం తరవాత అంతా సందడే. మరో వారంలో శర్మ ఇంటికి వచ్చేశాడు. శర్మ మిత్రులు శర్మను వదలలేదు.

"శర్మగారూ! పాముకి పాలు పోసి పెంచి నట్లయింది. చూశారా ఆ అవధాని గాడి పొగరు? అయినా, నమ్మకానికి రోజులు పోయాయి సుమండీ."

అవధానికి గడియ తీరిక లేదు. ఇంటికి వచ్చే వాళ్ళు తెల్లవార నివ్వరు. తొమ్మిది కాకుండా ఆఫీసరు కారు పంపుతాడు. ఇంటికి వచ్చేసరికి రాత్రి తొమ్మిది.

ఇంటికి వచ్చాక శర్మ ఆరోగ్యం దెబ్బతింది. ఆయాసం ఎక్కువగా ఉంటోంది. వచ్చే వాళ్ళు, చుట్టాలూ, బంధువులూ ఇల్లంతా కోలాహలం. హడావుడి. వంట మనిషిని పెట్టుకోవాల్సి వచ్చింది శకుంతలమ్మకి.

బోనస్ మీద ఎడ్వాన్సూ, జీతం పై ఎడాన్సూ, ఎల్ఐసీ లోనూ అన్నీ అయిపోయినా ఫస్టు తారీఖు కనుచూపుమేరలో లేదు.

శాంతమ్మకి ఇల్లు కదలడానికి వీలవడం లేదు. లంచ్టైమ్కి లంచ్, కాఫీ టైమ్కి కాఫీ పంపాలో అక్కరలేదో తెలియదు. భర్త ఇంటికి వస్తాడో రాడో తెలియదు. పంపిన రోజు ఇంటికి రావడం పంపని రోజు వస్తుండడం జరుగుతుందని ఒకరి మీద ఒకరికి విసుగు. భార్యా భర్తల మధ్య సయోధ్య సన్నగిల్లుతూంది. శకుంతలమ్మ గారిని చూడాలండీ అంటే చూద్దువు కాని. ముందు నా సంగతి చూడు అనేసేవాడు అవధాని.

మూడుసార్లు కబుర్లు అందుకున్నాకవో రోజు ఆఫీసు కారులోనే అవధాని శర్మ ఇంటికి వెళ్ళాడు. రావోయ్. బొత్తిగా కనపడడం మానేశావ్ మేనేజర్ గిరీ అంటే ఏమిటో తెలిసిందా.?

శర్మ చలోక్తిగా అన్న మాటలు అవధానిలో విసుగునూ, కోపాన్ని పుట్టించాయి.

"ఏముందిసార్!అలా వాళ్ళమీద వీళ్ళూ, వీళ్ళ మీద వాళ్ళూ చెబుతూ ఉంటారు. చస్తే పని చెయ్యరు. పైవాళ్ళ మాటలు వినడం వివేకంకాదు."

"అదేమిటోయ్, నేనేదో ఊరికే అన్నా. ఇంతకీ ఆఫీసరుగారు నన్ను గురించి అడపా తడపా అడుగుతున్నారా? ఏమిటో, ఆ డాక్టర్లు, ఫరవాలేదని పంపించేశారు. ఇప్పుడు జాగ్రత్తసుమండీ అంటున్నారు.... ఇక మన ఆఫీసరే చూడు....."

"పి.ఎఫ్. ఎడ్వాన్స్ చేయించేస్తా సార్.... ఏదో గొడవ మరేం అనుకోకండి. అసలు నిజం ఇది-ఆయనకు మనం ఎక్కడ గుర్తుంటాం? అటు హైదరాబాదునుంచి ఇటు భువనేశ్వరం దగ్గర నుంచి

ఇద్దరు సేల్స్ ఆఫీసర్లు వచ్చి ఇక్కడ తిష్టవేశారు. మేమేమో ఆఫీసు పనులతో సతమతమవుతున్నాం..... ఔట్ ఆఫ్ సైట్. ఔట్ ఆఫ్ మైండ్!"

శర్మ మనస్సు చివుక్కుమంది.

"పోన్లెద్దూ! వాళ్ళు అధికారులు. అధికారులకి మనస్సులుంటే పనులుకావు. స్నేహం, మమకారం,అధికారం వీటికి పొత్తు కుదరదు. అసలింతకీ ఇన్నిసార్లు ఎందుకు కబురు పెడుతున్నానో తెలుసా? ఎలాగేనా ఓ ఐదొందలు...."

"నా దగ్గర లేవు సార్.... మా ఆవిడ దగ్గర ఉంటే రేపు ఉదయం పంపుతా!"

- ఈ మాటలు లోపలనుంచి వింటున్న శకుంతలమ్మ మరి శాంతం దగ్గర డబ్బులేనట్టూ, ఉన్నది తనే వాడుకున్నట్టూ చెప్పి మరో మార్గం ఆలోచించమంది.

"పోనీ పి.ఎఫ్.లోన్ వెంటనే వచ్చే ఏర్పాటు చెయ్యి." గోడవైపు తిరిగి నిట్టూర్చాడు శర్మ.

ఆ రాత్రి శర్మకి నిద్రపట్టలేదు.

పొద్దున్నే ఆఫీసులో పి.ఎఫ్. గుమాస్తాతో శర్మలోన్ గురించి చెప్పాడు అవధాని.

"మరేం అనుకోకండి సార్! తలకు మించిన ఖర్చు చేస్తే బతుకు ఇలాగే ఉంటుంది. మన ఆఫీసులో కాస్త పచ్చగా ఉన్న వాళ్ళందరి దగ్గర నుంచీ ఆయన వాడుకున్నాడు. చివరకు బంట్రోతు అప్పారావు దగ్గర నుంచి కూడా!

-అవధానికి కడుపులో కెలుకుతున్నట్లనిపించింది.

అంతట్లోనే కబురు శర్మ శాశ్వతంగా కన్ను మూశాడని. ఐదు నిముషాల్లో ఆఫీసంతా శర్మ ఇంటిముందు హాజరయ్యింది.

సొమ్మసిల్లిపోతున్న శకుంతలమ్మను శాంతమ్మ ఓదారుస్తోంది. పిల్లల్ని సముదాయిస్తున్నాడు అవధాని. సాయంకాలం ఆరింటికి శర్మ భౌతికకాయం పంచభూతాలలో కలిసిపోయింది.

శాంతమ్మని తమ ఇంట్లో ఉండమని పాప విటల్ అడిగారు. "బావుందర్రా, అందరూ వచ్చి ఇక్కడ తిని కూచుంటే ఎలా'" అనేశాడు పుటుక్కున అవధాని.

మ్రాన్పడి కూచుండిపోయిన, బి.కాం చదువుతున్న బాబీ బావురుమన్నాడు.

***

-సాయంకాలం ఆఫీసులో అవధానిని ఓ మిత్రుడు అప్సరాకు పోదాం పద అని పిలిచాడు.

"అప్సరా వద్దు, రంభా వద్దు- అసలు సంగతి చెప్పు" అనేశాడు అవధాని.

"ప్రమోషన్ నీకు వస్తుందటగా... నీకు పుణ్యం ఉంటుంది. ఈ శుభసమయంతో నా కో చిన్న సాయం." జేబులోంచి లావుపాటి కవరు తీసి అవధాని చేతిలో పెడుతూ-" మా బావమరిది పెద్ద కొడుకు బి.కాం. పాసయి ఉన్నాడు. నీ మాట మీద ఆఫీసరుకు గురి. నువ్వే ం చేస్తావో నాకు తెలీదు. నే వెళ్ళొస్తా. మొన్ననే బావమరిదికి పి.ఎఫ్. వచ్చింది, నీ దయ."

చేతిలో కవరు చింపి చూసుకుని అతను వెళ్ళిన వంకే చూస్తూ ఆలోచనలో పడ్డాడు అవధాని.

"తాళాలు వేసెయ్యనా బాబూ! నైట్ వర్క్ ఉంటుందా?" ముసలి బంట్రోతు అడిగాడు.

ఇంటి దగ్గరకు వెళ్ళేసరికి శర్మ పెద్దకొడుకు, శర్మ బావమరిదీ తనకోసం చూస్తున్నారు.

శాంతమ్మ ఇద్దరికీ ఫలహారాలు పెట్టింది. వారి వంక చూడకుండా లోపలకు వెళ్ళిపోయాడు అవధాని. మరో ఐదు నిముషాలకు బయటకు వచ్చాడు.

"నమస్కారం సార్!" అన్నాడు శర్మ బావమరిది. శర్మ కొడుకు బాబీకూడా లేచి నుంచున్నాడు.

అవధాని విసుగ్గా పెట్టాడు ముఖం: "చూడు, శాంతం! నాకు వంట్లో బాగులేదు. పక్క కాస్త దులిపి పెట్టు, పడుకుంటా.,."

వచ్చిన వాళ్ళిద్దరూ తెల్లబోయారు.

"ఒక్క నిముషం, సార్! నేను రేపు పొద్దున్నే బయలుదేరి మావూరు వెళుతున్నా! మీకు కాస్త చెప్పిపోదామని..... నిరాధారంగా మా బావ వీళ్ళను వదిలేశాడు. మీకు తెలియని ఆస్తి వీళ్ళకు లేదు.... ప్రయివేట్‌గా బి.కాం. పూర్తి చేస్తాడు. మీరే ఏదో దోవ చూపించాలి వీడికి."

"ఇందులో నాదేముందండీ.....ఉద్యోగం ఇచ్చేవాడిని నేను కాను. వేసేవాళ్ళకి అనేకమైన మొగమాటలూ లావాదేవీలూ ఉంటాయ్.... ఇందులో నేను చెయ్యగలిగింది మాత్రం లేదు. అంత్యనిష్టూరంకంటె ఆది నిష్టూరం మేలు. నామీద ఈ బరువు పెట్టకండి. మరి వస్తా..."

లోపల నుంచి కాఫీ పట్టుకుని వస్తున్న శాంతమ్మ భర్త విసురుగా లోపలకు వెళ్ళిపోవడం చూసి తెల్లబోయింది.

అతని మనసులోని ఆలోచన ఏమిటో అతను చెప్పే వరకు అడగదలచుకోలేదు ఇల్లాలు.

తెల్లవారింది.

భర్త అద్దంముందు నుంచుని కేకవేశాడు- ఏం అర్థం కాలేదు శాంతమ్మకి.

తొమ్మిదింటికే ఆఫీసరు ఇంటికివెళ్ళి- "సార్! మన శర్మగారి కొడుకు ఇంటర్ పాసయ్యాడు. బి.కాం. చదువుతున్నాడనుకోండి, పాపం ఏం మిగల్చలేదు శర్మ మీరు దయతలచి...

నేరుగా విషయానికి వచ్చాడు అవధాని.

సాయంకాలం ఇంటికి వచ్చి అద్దంలో ముఖం చూసుకుని తృప్తిగా నవ్వుకున్నాడు.

ఆంధ్రప్రభ 7.12.1977